క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం



పాన్‌గల్: పార్టీ నాయకులు, కార్యకర్తలు పేదల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికుల చట్టాలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ సెక్టార్లుగా మార్చడానికి పని చేస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తోందని ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలను విస్మరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. హామీల అమలు, సమస్యలపై ప్రజలను చైతన్యం చేస్తూ వారి పక్షాన ఉంటూ ప్రతి కార్యకర్త పోరాటం సాగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాల్యానాయక్, వెంకటయ్య, నిరంజన్, రాము, జంబులయ్య, వెంకటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యదర్శిగా బాల్యానాయక్..

పార్టీ మండల కమిటీ సమావేశంలో మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన బాల్యానాయక్‌ను మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా, మండల నాయకులు, కార్యకర్తల తోడ్పాటుతో మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బాల్యానాయక్ పేర్కొన్నారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

పాన్‌గల్: గ్రామానికి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా హరితహారానికి అవసరమగు మొక్కలను సిద్ధం చేయాలని డీటీ, గ్రామ ప్రత్యేకాధికారి అశోక్‌నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని రాయినిపల్లిలో ఆయన పర్యటించి నర్సరీని పరిశీలించి, పలు కాలనీల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాల నీలో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, నిల్వ నీటిని వారానికి పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థి ప్రతినిధుల ఎన్నిక



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ మాలతి ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ విద్యార్థి ప్రతినిధుల ఎంపిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌తో పాటు లిటరరీ, కల్చరల్, స్పోర్ట్స్, హెల్త్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు విద్యార్థులు ఓటు వేసి ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే నిర్వహించి ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రాధాన్యతను విద్యార్థులు అర్థం చేసుకునే అవకాశం కల్పించిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థి దశ నుంచే నిర్వహించే మాదిరి ఎన్నికలు భావి పౌరులకు వారి బాధ్యతను తెలియజేస్తాయన్నారు.

మెరుగైన విద్య అందించాలి



ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈఓ ఉషారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద ఒకటో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు వర్క్ బుక్కులు, ఉపాధ్యాయుల అధ్యాపక దీపికలు, 10వ తరగతి అధ్యాపక దీపికలు, రాగిపిండి, బెల్లం పొడి మిశ్రమం పాకెట్లు తదితర వాటిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మెరుగైన విద్యనందించి ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ అర్జున్ తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయ కార్మిక సమగ్ర చట్టం తీసుకురావాలి

ఆత్మకూర్: దేశంలో అత్యధికంగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్మికులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందించారు. వ్యవసాయ కూలీలకు రూ.600 కూలి, ఇన్సూరెన్స్, బీమా అమలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.12 వేలు జీవనభృతి కల్పించాలని, 50ఏళ్లు దాటిన వారికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



గోవర్ధనగిరిలో పర్యటిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి



అమరచింత ఎస్సీ వసతి గృహం వద్ద..



తిప్పడంపల్లిలో..



పిన్నంచర్లలో నిల్వ నీటిని పారబోయిస్తున్న డీపీఓ రమణమూర్తి

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

- దోమల వ్యాప్తి నివారణకు చర్యలు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీపీఓ రమణమూర్తి

వీపనగండ్ల/చిన్నంబావి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ సంచిత్‌సంగ్వార్‌తో కలిసి వీపనగండ్ల, చిన్నంబావి మండల కేంద్రాలతో పాటు గోవర్ధనగిరి, వెల్టూరులో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజల వద్దకు వెళ్లి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఇంటి పరిసరాలలో ఖాళీ కుండలు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను బాధ్యతాయుతంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి రోగులకు అందుతున్న మందులు, వైద్యులు నిర్వహిస్తున్న విధులపై రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు సకాలంలో ఆస్పత్రికి రావడం లేదని గ్రామస్తులు విన్నవించగా.. ఇక నుంచి వైద్య సిబ్బంది విధిగా ఆస్పత్రికి హాజరయ్యే విధంగా చూస్తామని హామీనిచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మీసాల రాములు, సీపీఎం నాయకులు ఆశన్న, శ్రీనివాసులు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చిన్నంబావి తహసీల్దార్ ఇక్బాల్, ఎంపీడీఓ రమణరావు, మండల వ్యవసాయధికారి డాకేశ్వర్‌గౌడ్, ప్రత్యేకాధికారి లక్ష్మప్ప, బీపీఆర్‌ఓ సీతారాంనాయక్, ఏఈ తేజ, డీటీ కృష్ణమూర్తి, ఆర్‌ఐ కురుమూర్తి పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుని రోగాలను తరిమేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రాజు, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా 9వ వార్డులో కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, సిబ్బందితో కలిసి ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.

ఆస్పత్రి సందర్శన

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రాజు, చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. వైద్యాధికారితో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాల్లో పెరిగిన ముళ్లపొదలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పిన్నంచర్ల, తిప్పడంపల్లిలో..

మండలంలోని పిన్నంచర్లలో డీపీఓ రమణమూర్తి, ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ నర్సింగ్‌రావు, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్ పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అమరచింత: ప్రజలందరూ తమ ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. శుక్రవారం ఆమె పట్టణంలోని రెండో వార్డులోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహ ఆవరణంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వసతి గృహం ముందున్న మురుగుకాల్వలో పెరిగిన ముళ్లపొదలు, జమ్ము తొలగించారు. అనంతరం కొత్తతండాలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, ఆర్‌ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ నరసింహులు అన్నారు. మండలంలోని ధర్మాపురం, మస్తీపురం గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు కాల్వలు, కుంటల్లో దోమల నివారణ కోసం నిరంతరం మందులు పిచికారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండొచ్చని ఎంపీడీఓ కోటేశ్వర్, పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాందాపూర్‌లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దీంతోపాటు మండలంలోని కేతేపల్లి, చింతకుంట గ్రామాల్లో డ్రై డేలో వైద్య సిబ్బంది పాల్గొని ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

మదనాపురం: వర్షకాలం సీజన్‌లో వచ్చే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. కాలనీలో మురుగు కాల్వ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని, సూపర్‌వైజర్ ప్రమీల సిబ్బంది ఉన్నారు.



మదనాపురంలో..



ధర్మాపురంలో..



మాందాపూర్‌లో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు



కేతేపల్లిలో నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

ఒండ్రు మట్టి టిప్పర్ల అడ్డగింత

ఖిల్లాఘనపురం: టిప్పర్లతో రోడ్డు మీద ఇష్టానుసారంగా ఒండ్రు మట్టిని తరలిస్తుండటంతో మట్టి రోడ్డు మీద పడి అల్లమాయపల్లికి చెందిన మొల్గర నర్సింహ ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. ఇది గమనించిన అల్లమాయపల్లి, రోడ్డుమీది తండాలకు చెందిన కొందరు ప్రజలు ఒండ్రుమట్టి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. సంబంధిత యజమాని రావాలని, తమకు ఏదైనా అపాయం జరిగితే కాంట్రాక్టర్‌దే బాధ్యత అని రాతపూర్వక హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు టిప్పర్లను నిలిపివేసి కాంట్రాక్టర్ కోసం మూడు గంటలు అక్కడే వేచి ఉన్నారు. చివరకు రాత్రి 7:30 గంటల సమయంలో ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు వచ్చి గ్రామస్తులకు నచ్చజెప్పి టిప్పర్లను పంపించారు. దీనిపై గ్రామస్తులు పోలీసుల తీరుపై అసహనం వ్యక్తంచేశారు.



ప్రజలు అడ్డుకోవడంతో నిలిచిన టిప్పర్లు

పోలీసులు కాంట్రాక్టర్ పక్షమే..



నేను పొద్దుగాల వాన ముసురు వచ్చినప్పుడు మోటార్ సైకిల్‌పై రోడ్డుపైకి వెళ్లాను. ఒండ్రు మట్టి రోడ్డుపై పడడంతో.. రోడ్డంతా బురదగా మారి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాను. ఇది చూసిన మా ఊరివాళ్లు, రోడ్డుమీదితండా వాళ్లు నాకు అండగా నిలిచి టిప్పర్లను ఆపిండ్రు. అక్కడకు చేరుకున్న పోలీసులు తమకు న్యాయం చేయకుండా కాంట్రాక్టర్ తరఫునే నిలిచారు. కాంట్రాక్టర్ నుంచి స్పష్టమైన హామీ ఏది ఇప్పించలేదు.

– మొల్గర నర్సింహ, అల్లమాయపల్లి

ప్రభుత్వ, ఆలయ భూములను కాపాడండి

- కబ్జాలపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు
- టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్

ఆత్మకూర్: పట్టణంలోని లేఅవుట్లలో ప్రభుత్వానికి కేటాయించిన 400లకు పైగా 10 శాతం ప్లాట్లు అన్యాక్రాంతమయ్యాయని, వీటి ద్వారా రూ.5 కోట్లకు పైగా అక్రమంగా ఆర్జించారని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి మున్సిపాలిటీ పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ, ఆలయ స్థలాలను సందర్శించారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 44 ఎకరాల్లో నాలుగు ఎకరాలకు పైగా స్థలం కబ్జా అయిందన్నారు. ఈ అక్రమ బాగోతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే అక్రమ కట్టడాలను తొలగిస్తామని తెలిపారు.

శిఖం భూమిలో వెలసిన నిర్మాణాలు..

పరమేశ్వరస్వామి చెరువు కట్ట వద్ద శిఖం భూమిలో అక్రమంగా షాపులను నిర్మించారని, పరమేశ్వరస్వామి ఇనాం భూమిని ప్లాట్లుగా విక్రయించారని, హైటెక్ టాకీస్ వద్ద గ్రామకంఠం భూమిలో నిర్మాణాలు చేపట్టారని వివరించారు. పూర్తి ఆధారాలతో కలెక్టర్, కమిషనర్, తహసీల్దార్, సీఐ, ఎస్ఐ, విజిలెన్స్ అధికారులకు వినతిపత్రాలు ఇదివరకే అందించామన్నారు.



ఆలయభూమిని పరిశీలిస్తున్న అధికారులు, కేశం నాగరాజుగౌడ్, నాయకులు

అధికారుల పరిశీలన..

ఆలయ, 10శాతం ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కావడంపై కాంగ్రెస్ నాయకుల ఇచ్చిన ఫిర్యాదుతో మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈమేరకు టౌన్‌ప్లానర్ సుధాకర్, మున్సిపాలిటీ అధికారులు 10 శాతం ప్లాట్లలో అక్రమ నిర్మాణాలు, కబ్జాకు గురైన స్థలాలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించి ఆదేశాల అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, బాలకిష్టన్న, పరమేష్, నల్గొండ శ్రీనివాసులు, సాయిరాఘవ, నాగేష్, దాము, మహేష్, వెల్డింగ్ రమేష్, నర్సింహ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారెడ్డి జన్మదిన వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు డీసీసీ కార్యాలయం ఎదుట పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, శ్రీరంగాపురంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పెబ్బేరు పట్టణ కేంద్రాల్లో నాయకులు కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు అనాథ, వృద్ధాశ్రమాలలో అన్నదానం, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవన్న యాదవ్, చీర్ల జనార్దన్, ఆవుల చంద్రశేఖర్, నందిమల్ల యాదయ్య, కృష్ణ, చెన్న రాములు, వెంకటేష్, రాగి వేణు, సింగిల్ విండో అధ్యక్షుడు గౌని కోదండరామిరెడ్డి, ఎద్దుల విజయవర్దన్‌రెడ్డి, ఖిల్లాఘనపురం మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్, గంజాయి రమేష్, నరేందర్‌గౌడ్, ఎంపీటీసీ మల్లేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖిల్లాఘనపురం: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ కొండయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలు, గిరిజన తండాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.


ప్రజాప్రతినిధులు ఎప్పటికీ ప్రజాసేవకులే



ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

కొత్తకోట రూరల్: ప్రజాప్రతినిధులు ఎప్పటికీ ప్రజల సేవకులేనని, మంచి పనులు చేస్తేనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దమందడి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రఘుప్రసాద్ అధ్యక్షత నిర్వహించారు. సమావేశానికి జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో వనపర్తిని ముందంజలో నిలిపేందుకు దృష్టి పెడతానన్నారు. ప్రజాప్రతినిధులుగా ఒక్కసారిగా ఎన్నికైతే సమాజంలో ఎప్పటికీ ప్రజాసేవకులుగానే మిగిలిపోతారని తెలిపారు. మండలంలోని వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని, సాగుచేసిన పంటలను పక్కాగా నమోదు చేయించాలన్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరున ప్రజాధనం దుర్వినియోగం చేసిందని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీర్చలేదని, నియోజకవర్గంలో కేవలం తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకే రూ.3.60కోట్ల ప్రత్యేకంగా కేటాయించామన్నారు. సీజన్ వ్యాధులపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయితీరాజ్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో పనిచేసే శానిటేషన్ వర్కర్లకు వేతనాలు క్రమం తప్పకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. పదవీ కాలం ముగిస్తున్నందున ఎంపీటీసీలను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఎంపీడీఓ సద్గుణ, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వైస్ఎంపీపీ భారతీ, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణను ఆపాలి



అమరచింత: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఆపాలంటూ శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ తెలంగాణకు బంగారు గనిగా ఉన్న సింగరేణిని బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసేందుకు చర్యలను వేగవంతం చేసిందని విమర్శించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో సింగరేణి వేలం ద్వారా టెండర్లను ఆహ్వానించడంతో ప్రైవేట్ ప్రక్రియ వేగవంతంగా చేయడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేందుకే పనిచేస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం తక్షణమే ప్రైవేటీకరణ విషయంలో వెనక్కి తగ్గకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎన్ రమేష్, అజయ్, శ్యాంసుందర్, నరసింహ, విష్ణు, పాషా, ఆటో రాము పాల్గొన్నారు.

పాత బస్టాండ్ వినియోగంలోకి తేవాలి

వనపర్తి టౌన్: వనపర్తి పాత బస్టాండ్‌ను పునఃప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదాయాన్ని డీఎం దుర్వినియోగం చేస్తున్నారని, వెంటనే డీఎంపై విచారణ కమిటీ వేయాలని కోరారు. ఆర్టీసీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పాలమూరు ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవికి వినతిప్రతాన్ని రాసి శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని రీజనల్ మేనేజర్ కార్యాలయ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనపర్తి కొత్త బస్టాండ్ ప్రారంభించినప్పటి నుంచి మూత్రశాలలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సు, పసిపిల్లలకు తల్లులు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక క్యాబిన్ నిర్మించాలని కోరారు. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉందని, వారు కూర్చోవడానికి బెంచీలను ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలన్నారు. కొన్ని గ్రామాల్లో ఒకరిద్దరు మహిళలు ఉంటే బస్సును ఆపకుండా వెళ్తున్నారని, దీంతో గ్రామీణ మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రాయన్న సాగర్, రవి, అనిల్, కుమార్‌గౌడ్ ఉన్నారు.




వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట గ్రామ మాజీ సర్పంచ్ రమేష్(35) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, రాముయాదవ్, సాగర సంఘం నాయకుడు తిరుపతయ్యసాగర్, తదితరులు మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు పెంటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ 5 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, జగన్నాథంనాయుడు ఉన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం



వనపర్తి టౌన్: మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ పుట్టపాక మహేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటుగా కౌన్సిల్ సభ్యులకు ఎజెండా కాపీలను సైతం అందించారు. ఎక్స్ అఫిషియో హోదాలో ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరుకానున్నారు. కొత్త పాలకవర్గం ఎన్నికైనప్పటి నుంచి పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో సాధారణ సమావేశం నిర్వహించలేకపోయారు.

చర్చకు వచ్చేనా..

లింగిరెడ్డికుంట, రాజీవ్‌నగర్ బాట షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో 20 ఏళ్ల కిందట వేలం పాట ద్వారా టెండర్లు దక్కించుకున్న వారే నేటికీ కొనసాగుతున్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో పుర షాపింగ్ కాంప్లెక్స్‌పై నామమాత్రపు అద్దె వసూలు, రీటెండర్‌పై చర్చ జరుగుతున్నా ఇప్పటి వరకు ఏ పాలకవర్గం కూడా అందుకు సంబంధించిన కార్యచరణపై ముందుకు తీసుకెళ్లలేదు. దీనికి తోడుగా స్వీపింగ్ మిషన్ కొనుగోళ్లలో అవకతవకతలు, కర్నూల్ రోడ్డులో విస్తరణ పరిధి కుదింపు, విస్తరణ పనులు చేపట్టడంపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. పారిశుద్ధ్య సిబ్బంది, ఇంటి ఆస్తి పన్ను, మదింపు విషయంలో అక్రమాలు, ఇంజినీరింగ్ సెక్షన్‌లో కుళాయి బిల్లుల్లో వ్యత్యాసాలు, అసంపూర్తి డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపుపై వినయం ప్రస్తావనకు రావొచ్చని భావిస్తున్నారు. పురపాలికకు అత్యధికంగా ఆదాయం సమకూర్చే తైబజార్ వసూళ్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తుంది.